TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-147 | పేజీలు:-4 | శనివారం 09 - 05 - 2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తెలియదు



- బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసి ఇబ్బందులకు గురి చేశారన్న బండి సంజయ్
- అలా హింసించడం తమకు తెలియదన్న బండి సంజయ్
- వారిలా డ్రగ్స్ తీసుకోవడం తనకు తెలియదని వ్యాఖ్య

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. - మిగతా 2 లో

# వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం కొడంగల్ ప్రతిష్ఠను మరింత పెంచుతుంది


- కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన సీఎం
- అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గ్రూపులు పక్కన పెట్టాలన్న సీఎం
- కొడంగల్‌ను రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్న రేవంత్ రెడ్డి




వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం కొడంగల్ ప్రతిష్ఠను మరింత పెంచుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కర్ణాటకలోని భక్తులకు కూడా ఈ ఆలయం మరింత చేరువగా ఉంటుందని

## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన

ఆ ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయవద్దు!




- ఎల్లుండి హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోదీ
- బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఆంక్షలు
- రేపు అర్ధరాత్రి నుంచి 24 గంటల పాటు అమల్లో ఆంక్షలు
- డ్రోన్లు, పారా గ్లైడర్లను ఎగురవేయడం నిషేధం

ఎల్లుండి (మే 10) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. - మిగతా 2 లో

## పుతిన్ హత్యకు కుట్ర

ఎక్కువ కాలం బంకర్లోనే గడుపుతున్న రష్యా అధినేత

- పుతిన్ భద్రత మరింత కట్టుదిట్టం
- బహిరంగ పర్యటనలను పూర్తిగా తగ్గించుకున్న పుతిన్
- పుతిన్ ఉండే ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ ఆధారిత పరికరాలపై నిషేధం



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై హత్యాయత్నం జరిగినట్టు వస్తున్న వార్తలు అంతర్జాతీయ స్థాయిలో పెను సంచలనం రేపుతున్నాయి. ముఖ్యంగా ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న ఈ తరుణంలో, పుతిన్ తన భద్రతను అత్యంత కట్టుదిట్టం చేసుకోవడం గమనార్హం. ఈ ప్రపంచంలోనే - మిగతా 2 లో

## హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తత

అమెరికా, ఇరాన్ మధ్య కాల్పులు

- హర్మూజ్‌లో తమ మూడు నౌకలపై ఇరాన్ దాడి చేసిందన్న ట్రంప్
- ఇరాన్ దాడిని తిప్పికొట్టామని, దళాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని వెల్లడి
- ఒప్పందంపై త్వరగా తేల్చకుంటే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్‌కు హెచ్చరిక
- అమెరికానే కాల్పుల విరమణను ఉల్లంఘించిందని ఆరోపించిన ఇరాన్



అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న తమ మూడు యుద్ధనౌకలపై - మిగతా 2 లో

## మమతా బెనర్జీని ఆమె నియోజకవర్గంలో సువేందు ఓడించారు



- టీఎంసీ ఓటమితో రాష్ట్రంలో అరాచక పాలన ముగిసిపోయిందన్న కేంద్రమంత్రి
- బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధించిందని వ్యాఖ్య
- అభివృద్ధితో పాటు హామీలు నెరవేర్చే బాధ్యత బీజేపీపై ఉందని వ్యాఖ్య

తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి,మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తమ పార్టీ నాయకుడు సువేందు - మిగతా 2 లో

## విజయ్ తో పాటు 107 మంది ఎమ్మెల్యేలు

# రాజీనామా చేస్తే

ఆ తర్వాత ఏం జరుగుతుంది?

- భారీ మెజార్టీ సాధించినా విజయ్ ను ఆహ్వానించని గవర్నర్
- విజయ్ సీఎం కాకుండా అడ్డుకునేందుకు ఒక్కటవుతున్న డీఎంకే, అన్నాడీఎంకే
- అదే జరిగితే 107 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామన్న విజయ్
- మళ్లీ ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని హెచ్చరిక
- అదే జరిగితే తమిళనాడులో రాష్ట్రపతి పాలన వచ్చే అవకాశం




తమిళనాడు రాజకీయాల్లో టీవీకే (ఒఖ) అధినేత విజయ్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపుతోంది. ఎన్నికల్లో అత్యధిక స్థానాలు (108 స్థానాలు. రెండు స్థానాల్లో

## అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్




- మమత ముందున్న మార్గం ఏంటి?.. రాజ్యాంగం ఏం చెబుతోంది?
- పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్ ఆర్.ఎన్. రవి
- సీఎం పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించిన మమతా బెనర్జీ
- అసెంబ్లీ రద్దయితే సీఎం పదవిలో కొనసాగడం రాజ్యాంగ విరుద్ధమన్న నిపుణులు
- ఆపద్ధర్మ సీఎంగానైనా కొనసాగడం గవర్నర్ విచక్షణపైనే ఆధారపడి ఉంటుంది
- ఎన్నికల ఫలితాలపై అభ్యంతరాలుంటే హైకోర్టులో పిటిషన్ వేయడమే మార్గం

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి - మిగతా 2 లో

## ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్



- ఏపీ ఈసెట్ 2026 ఫలితాలు విడుదల
- మొత్తం 91.72 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత
- ఫలితాలను 'ఎక్స్' వేదికగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్
- అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్‌లోనూ ర్యాంకు కార్డుల వెల్లడి
- బీటెక్ సెకండియర్‌లోకి లేటరల్ ఎంట్రీ కోసం ఈ పరీక్ష

ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్-2026) ఫలితాలు - మిగతా 2 లో

## జగన్ పాలనను ఏపీ ప్రజలే తిరస్కరించారని ఎద్దేవా



- టీవీకే విజయం వెనుక జగన్ ఫొటో ఉందనే ప్రచారంపై సత్యకుమార్ విమర్శలు
- విజయ్‌ని గవర్నర్ ఇబ్బంది పెడుతున్నారనే ప్రచారంలో నిజం లేదన్న సత్యకుమార్
- రోజా ఎక్కడ ప్రచారం చేస్తే అక్కడ ఓటమి తప్పదని వ్యాఖ్య

తమిళనాడు రాజకీయ పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ - మిగతా 2 లో

# 'నేను కాదు మనం' అనే స్ఫూర్తితో పనిచేయాలి

- ముగిసిన 7వ జిల్లా కలెక్టర్ల సమావేశం
- చంద్రబాబు కీలక ప్రసంగం
- 25 ప్రాధాన్యతా ప్రాజెక్టుల పూర్తికి ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల
- అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు సంతృప్త స్థాయిలో ఇవ్వాలని ఆదేశం
- 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామన్న సీఎం




రాష్ట్ర పరిపాలనలో ప్రజలే కేంద్రంగా పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలని, 'నేను కాదు, మనం' అనే సామూహిక స్ఫూర్తితో ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## మమతా బెనర్జీని ఆమె నియోజకవర్గంలో సువేందు ఓడించారు

మొదటిపేజీ తరువాయి - అధికారి ఆమె సొంత నియోజకవర్గంలో ఓడించారని కేంద్రమంత్రి అమిత్ షా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, బెంగాల్ ఐదు దశాబ్దాల పాటు ప్రజాస్వామ్య క్షీణత, శాంతిభద్రతల పతనంతో తీవ్ర సమస్యను ఎదుర్కొందని అన్నారు. ఇప్పుడు టీఎంసీ ఓటమితో రాష్ట్రంలో అరాచక పాలన ముగిసిపోయిందని వ్యాఖ్యానించారు. బీజేపీ బెంగాల్‌లో అద్భుత విజయం సాధించిందని అమిత్ షా అన్నారు. ఈ విజయం అసాధారణమని, బెంగాల్ చరిత్రలోనే కీలక మలుపు అన్నారు. ప్రచారం సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ఇప్పుడు బీజేపీ పైనే ఉందని స్పష్టం చేశారు. బెంగాల్ అభివృద్ధి బాధ్యత తమపైనే ఉందని అన్నారు. రాష్ట్రంలో పోలింగ్‌ను శాంతియుతంగా నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, భద్రతా దళాలు, రాష్ట్ర అధికారులను అమిత్ షా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా ఎన్నికల్లో ఓడిపోతోందని అన్నారు. ఎందుకు ఓడిపోతున్నామో ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఆత్మపరిశీలన చేసుకోని నాయకులు ఎప్పటికీ నిజమైన విజయాన్ని అందుకోలేరని అమిత్ షా అన్నారు.

## కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తెలియదు

మొదటిపేజీ తరువాయి - కేటీఆర్‌లా దోచుకోవడం, దాచుకోవడం తనకు తెలియదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారని, అలా హింసించడం తనకు తెలియదని అన్నారు. వారిలా డ్రగ్స్ తీసుకోవడం కూడా తనకు తెలియదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ రేస్ కేసు, విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి చేయడం తమకు తెలియదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని లేదంటే పరిస్థితులు మరోలా ఉంటాయని హెచ్చరించారు. వారి అహంకారం వల్లనే కేసీఆర్ ఓడిపోయి ఫామ్ హౌస్?కు పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. వరుస ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతున్నప్పటికీ కేటీఆర్‌లో మార్పు రావడం లేదని వ్యాఖ్యానించారు. పరేడ్ మైదానంలో ఈ నెల 10వ తేదీన జరగబోయే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తోందని అన్నారు. కేంద్ర నిధులతో తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. కేంద్రం నిధులివ్వకపోతే తెలంగాణ అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి కోసం మేం ఢిల్లీ నుంచి నిధులు తెస్తుంటే, కాంగ్రెస్ వాళ్లు మాత్రం ఇక్కడి నిధులను అధిష్ఠానానికి పంపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని నడుపుకోవడానికి తెలంగాణ సొమ్ము ఉపయోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. మోదీ తెలంగాణ అభివృద్ధి కోసమే వస్తున్నారని బండి సంజయ్ అన్నారు.c

## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన

మొదటిపేజీ తరువాయి - పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో రేపు అర్ధరాత్రి 12 గంటల నుంచి 24 గంటల పాటు డ్రోన్‌లు, పారాగ్లైడర్‌లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి పోలీసులు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పౌరులు ఆంక్షలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

మొదటిపేజీ తరువాయి - విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఈ ఫలితాలను 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ పరీక్షలో మొత్తం 91.72 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 23న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 32,434 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 29,750 మంది అర్హత సాధించారు. ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఈ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు (లేటరల్ ఎంట్రీ) ఈసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ జరుగుతుంది. ఫలితాలు, ర్యాంకు కార్డులను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ఞ్చ్మ.ఖజాంఞ్ష్త్రవ.ఖజా.న్త్రశీజ.అఅ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతో పాటు, విద్యార్థులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈసారి వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. తమ ఫోన్‌లోని వాట్సాప్ నుంచి 9552300009 నంబర్‌కు సందేశం పంపి కూడా ర్యాంకు కార్డును సులభంగా పొందవచ్చు. ఫలితాల విడుదల ప్రక్రియ పూర్తవడంతో, త్వరలోనే అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి విడుదల చేయనుంది. విద్యార్థులు తదుపరి ప్రకటనల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

## పుతిన్ హత్యకు కుట్ర

మొదటిపేజీ తరువాయి - అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన నేతలలో పుతిన్ ఒకరు. రష్యా ఫెడరల్ ప్రొటెక్టివ్ సర్వీస్ (ఎఫ్ఎస్ఓ) ఆయనను 24 గంటలూ ఒక కవచంలా కాపాడుతుంది. మాస్కో అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, కొన్ని నెలల క్రితం నోవ్‌గోరోడ్ ప్రాంతంలోని పుతిన్ ప్రైవేట్ నివాసం వద్ద పుతిన్ పై హత్యాయత్నం జరిగింది. అయితే భద్రతా కారణాల రీత్యా ఈ విషయాన్ని బయటకు వెల్లడించలేదు. హత్యాయత్నం నేపథ్యంలో, పుతిన్ భద్రతను భారీగా పెంచారు. ఈ కుట్ర నేపథ్యంలో పుతిన్ తన బహిరంగ పర్యటనలను పూర్తిగా తగ్గించుకున్నారు. యుద్ధ పర్యవేక్షణ కోసం ఆయన ఎక్కువ సమయం అత్యాధునిక సౌకర్యాలున్న భూగర్భ బంకర్లలోనే గడుపుతున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొంటున్నాయి. పుతిన్ ఉండే ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ ఆధారిత పరికరాలపై పూర్తి నిషేధం విధించారు. ఉక్రెయిన్ డ్రోన్ల ముప్పు నుంచి తప్పించుకోవడానికి మాస్కో నది వెంబడి భారీగా భద్రతా బలగాలను మోహరించారు. రష్యా వర్గాలు ఉక్రెయిన్‌పై ఆరోపణలు చేస్తున్నప్పటికీ, అటు అమెరికా, ఇటు ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సంస్థలు ఈ వార్తలను తోసిపుచ్చాయి. పుతిన్‌ను నేరుగా లక్ష్యంగా చేసుకోవడం వల్ల కలిగే అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా ఇలాంటి కుట్రలకు తాము పాల్పడలేదని వారు వాదిస్తున్నారు. గతంలో కూడా పుతిన్‌పై కనీసం ఐదు నుంచి ఆరు సార్లు హత్యాయత్నాలు జరిగినట్లు చరిత్ర చెబుతోంది.

## హర్మ్యూజ్ జలసంధిలో ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి - ఇరాన్ దాడి చేసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం సంచలన ఆరోపణలు చేశారు. శాంతి ఒప్పందంపై ఇరాన్ వెంటనే నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తులో మరింత హింసాత్మకంగా, తీవ్రంగా బదులిస్తామని హెచ్చరించారు. ఇరాన్‌తో ఫలప్రదమైన చర్చలు జరిగాయని ట్రంప్ ప్రకటించిన 24 గంటల్లోనే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. హర్మ్యూజ్ జలసంధిలో ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు, చిన్న పడవలతో దాడికి ప్రయత్నించిందని, అయితే తమ నౌకలకు ఎలాంటి నష్టం జరగలేదని ట్రంప్ తెలిపారు. అమెరికా బలగాలు జరిపిన ప్రతిదాడిలో ఇరాన్ దళాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని ఆయన పేర్కొన్నారు. "ఒప్పందంపై త్వరగా తేల్చకపోతే భవిష్యత్తులో వారిని మరింత తీవ్రంగా దెబ్బతీస్తాం" అని ట్రంప్ హెచ్చరించారు. అయితే, ఈ దాడిని "మృదు స్పర్శ (లవ్ ట్యాప్)" అని అభివర్ణించడం గందరగోళానికి దారితీసింది. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఇప్పటికీ అమల్లో ఉందని ఆయన చెప్పడం గమనార్హం. మరోవైపు, అమెరికా ఆరోపణలను ఇరాన్ ఖండించింది. అమెరికానే కాల్పుల విరమణను ఉల్లంఘించి తమ నూనె ట్యాంకర్ సహా రెండు నౌకలపై దాడి చేసిందని ఇరాన్ ఆరోపించింది. దానికి ప్రతిస్పందనగానే తాము అమెరికా నౌకలను లక్ష్యంగా చేసుకున్నామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్, బందర్ అబ్బాస్ వంటి నగరాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. దీంతో ఇరు దేశాల మధ్య నెలకొన్న తాత్కాలిక ప్రశాంతతకు తెరపడి, యుద్ధ వాతావరణం నెలకొంది.

## జగన్ పాలనను ఏపీ ప్రజలే తిరస్కరించారని ఎద్దేవా

మొదటిపేజీ తరువాయి - యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గవర్నర్ వ్యవస్థపై స్పందించారు. తమిళనాడులో టీవీకే అధినేత విజయ్‌ని ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించే విషయంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అనుసరిస్తున్న తీరుపై వస్తున్న విమర్శలను మంత్రి తిప్పికొట్టారు. గవర్నర్ విజయ్‌ని ఇబ్బంది పెడుతున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని, ఆయన పూర్తిగా రాజ్యాంగ నిబంధనలకు లోబడే నిర్ణయాలు తీసుకుంటారని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తులు నిబంధనల ప్రకారమే నడుచుకుంటారని ఆయన పునరుద్ఘాటించారు. తమిళనాడు ఎన్నికల్లో విజయ్ సాధించిన విజయం వెనుక జగన్ ఫొటో ఉందంటూ వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న ప్రచారాన్ని మంత్రి హాస్యాస్పదంగా అభివర్ణించారు. సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రజలే జగన్ పాలనను తిరస్కరించి 11 సీట్లకు పరిమితం చేశారని, అలాంటిది పొరుగు రాష్ట్రంలో ఆయన ప్రభావం ఉంటుందనుకోవడం భ్రమ అని ఎద్దేవా చేశారు. "బోర్డర్ దాటితే జగన్‌ను ఎవరైనా గుర్తుపడతారా?" అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల్లో మాజీ మంత్రి రోజా డీఎంకే తరఫున ప్రచారం చేసిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆమె ఎక్కడ ప్రచారం చేస్తే అక్కడ ఓటమి ఖాయమని, డీఎంకే పరాజయం పాలవ్వడమే దీనికి నిదర్శనమని విమర్శించారు. ఏపీలో ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీ నేతలు ఇంకా తమ తీరు మార్చుకోలేదని ఆయన మండిపడ్డారు.

# 'నేను కాదు మనం' అనే స్ఫూర్తితో పనిచేయాలి



మొదటిపేజీ తరువాయి - అమరావతిలో రెండు రోజుల పాటు జరిగిన 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ శుక్రవారం ముగిసింది. సుమారు 22 గంటల పాటు సాగిన ఈ మారథాన్ సమావేశాల్లో కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి పలు కీలక అంశాలపై సమీక్షించారు. ముగింపు ఉపన్యాసంలో రాష్ట్ర సాగునీటి రంగంపై కీలక ప్రకటన చేస్తూ, 25 ప్రాధాన్యతా ప్రాజెక్టులను నిర్దిష్ట గడువులోగా పూర్తిచేసేందుకు ఉద్దేశించిన 'ఇరిగేషన్ క్యాలెండర్'ను విడుదల చేశారు. పాలనలో టీమ్ వర్క్ ప్రాధాన్యతను ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. "నేను అనే అహం వీడి, మనం అనే భావనతో కలిసికట్టుగా పనిచేస్తేనే అద్భుతమైన ఫలితాలు సాధించగలం. మన పాలన పూర్తిగా పౌర కేంద్రంగా (సిటిజెన్ సెంట్రిక్) ఉండాలి. నేను ప్రతి సోమవారం ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలు వింటున్నాను. ఇకపై మీరు కూడా ప్రతి శుక్రవారం ఒక నియోజకవర్గానికి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలి" అని అధికారులను ఆదేశించారు. అత్యుత్తమ పాలనా విధానాలను అధ్యయనం చేసేందుకు మంత్రుల బృందాన్ని సింగపూర్ పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

### అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలని, కనీస అవసరాలు తీర్చడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "రాష్ట్రంలో రహదారులు, వీధిదీపాలు, మురుగునీటి పారుదల వంటి మౌలిక వసతులను మెరుగుపరచడంపై దృష్టి సారించాం. పేదల జీవన ప్రమాణాలను పెంచేందుకు 'పీ4' (ప్రజలు, ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం" అని వివరించారు. ప్రజలపై విద్య, వైద్యం, విద్యుత్ భారాన్ని తగ్గించేలా అధికారులు చొరవ చూపాలని, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. తాము నిర్వహించే సమీక్షలు, సమావేశాలన్నీ పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమం కోసమేనని గుర్తుంచుకోవాలన్నారు.

### పెట్టుబడుల ఆకర్షణలో ఏపీకి బ్రాండ్ ఇమేజ్

రాష్ట్ర ప్రభుత్వ పారదర్శక విధానాల వల్ల గత 23 నెలల్లో నెలకు లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దీనివల్ల 24 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. "ఏపీకి ఉన్న బ్రాండ్ ఇమేజ్ కారణంగానే పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే ఇవి సాధ్యమవుతాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి" అని ఎస్పీలకు సూచించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నామని, వాటిని క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా (గ్రౌండింగ్) చూసే బాధ్యత కలెక్టర్లు, ఎస్పీలు తీసుకోవాలని ఆదేశించారు. గూగుల్, రిలయన్స్ వంటి డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో వస్తున్న పెట్టుబడులు రాష్ట్ర భవిష్యత్తుకు సంకేతమని అన్నారు.

### లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ... మౌలిక సదుపాయాల కల్పన

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చంద్రబాబు తెలిపారు. "రాష్ట్రంలో రూ.1.03 లక్షల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఇచ్ఛాపురం నుంచి చెన్నై వరకు నాలుగు లైన్ల రైల్వే ట్రాక్ రాబోతోంది. రూ.10 వేల కోట్లతో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నాం. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే ఏపీ దేశంలోనే కీలకమైన లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుంది," అని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టుల వేగవంతమైన పూర్తికి భూసేకరణ వంటి అంశాలను కలెక్టర్లు చొరవ తీసుకుని పరిష్కరించాలని సూచించారు.

### సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం.. ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల

రాష్ట్ర జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి ప్రకటించారు. "పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు, విశాఖ పరిశ్రమలకు నీరందిస్తాం. ఈ ఏడాది వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేయబోతున్నాం. నేరడి బ్యారేజ్ పనులు కూడా ఈ ఏడాదే ప్రారంభిస్తాం. ఉత్తరాంధ్రలోని పెండింగ్ ప్రాజెక్టులను వచ్చే రెండేళ్లలో, రాయలసీమలో హంద్రీనీవా ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇందులో భాగంగా 25 ప్రాధాన్యతా ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నాం" అని తెలిపారు. గుంటూరు ఛానల్, తుంగభద్ర, కాటన్ బ్యారేజ్ గేట్ల మరమ్మతులు కూడా ఇందులో భాగంగానే పూర్తి చేస్తామని చెప్పారు.

### అందరికీ ఇళ్లు.. సంక్షేమ పథకాల పటిష్ఠ అమలు

సంతృప్త స్థాయిలో అందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలి. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి వాటిని క్రమబద్ధీకరించాలి. 22ఏ భూముల సమస్యలను వచ్చే కలెక్టర్ల సమావేశంలోగా పరిష్కరించాలి" అని ఆదేశించారు. బుడగజంగాలకు ఎస్సీలకు వర్తించే ప్రయోజనాలను (ఉద్యోగాలు మినహా) అందించాలని, బీసీ రిజర్వేషన్ల కోసం కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అరకు కాఫీకి గ్లోబల్ బ్రాండ్ తీసుకురావాలని, జాతీయ, అంతర్జాతీయ విద్య కోసం పావలా వడ్డీకే రుణాలు అందించాలని సూచించారు. అధికారులు టాస్క్ ఫోర్స్‌గా ఏర్పడి, ఉత్తమ పద్ధతులను అవలంబిస్తూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం కొడంగల్ ప్రతిష్ఠను మరింత పెంచుతుంది

మొదటిపేజీ తరువాయి - అన్నారు. కొడంగల్‌లో శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వరస్వామి (కొడంగల్ బాలాజీ) ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా యాగంలో పాల్గొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణంతో పాటు కొడంగల్‌లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌలతాబాద్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గ్రూపులు పక్కనపెట్టి అందరం కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ శాసనసభ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దగలుగుతామని అన్నారు. ప్రతి గ్రామంలో చిన్న సమస్యలు, బేదాభిప్రాయాలు ఉంటాయని, అవన్నీ పక్కన పెట్టి అందరూ కలిసి కట్టుగా ఉండాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని చాలామంది నాయకులు కలలు కన్నారని అన్నారు. కానీ వివిధ కారణాల చేత పలుమార్లు వాయిదాపడుతూ వచ్చిందని వ్యాఖ్యానించారు. నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో తలపెట్టిన పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆనాడు చదువుకోవడానికి కొడంగల్ వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు అందరూ కొడంగల్ వచ్చేలా అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు చురుగ్గా పనిచేయాలని అన్నారు. కృష్ణా-వికారాబాద్ రైల్వే లైన్‌కు కూడా సూత్రప్రాయంగా అనుమతులు తెచ్చుకున్నామని అన్నారు. ఇక్కడ అపారమైన సున్నపురాయి ఉందని తెలిపారు. టేకులగోడు ప్రాంతంలో పెద్ద ఎత్తున సిమెంట్ పరిశ్రమకు అన్ని అనుమతులు ఇచ్చామని అన్నారు. రాబోయే ఆరేళ్లలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణం జరిగితే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. పెద్ద ఇండస్ట్రియల్ పార్కును లగచర్ల దగ్గర నిర్మిస్తున్నట్టు చెప్పారు. కోస్గి నుంచి నేరుగా అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 300 అడుగుల రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు.

# అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్

మొదటిపేజీ తరువాయి - పదవికి రాజీనామా చేసేందుకు మమతా బెనర్జీ నిరాకరించడంతో గవర్నర్ ఆర్.ఎన్. రవి శాసనసభను అధికారికంగా రద్దు చేశారు. రాష్ట్ర అసెంబ్లీ గడువు గురువారం అర్ధరాత్రితో ముగియనున్న నేపథ్యంలో రాజ్‌భవన్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 174(2)(బి) ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించి, మే 7 నుంచి శాసనసభను రద్దు చేస్తున్నట్లు గవర్నర్ తన ఉత్తర్వులలో స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని మమతా బెనర్జీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ రాజకీయ వివాదం న్యాయస్థానాలకు చేరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### రాజ్యాంగం ఏం చెబుతోంది?

ప్రస్తుత పరిస్థితులపై రాజ్యాంగ నిపుణులు స్పష్టతనిస్తున్నారు. విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీకి చెందిన స్వప్నిల్ త్రిపాఠి ఎన్డీటీవీకి ఈ విషయంపై వివరణ ఇచ్చారు. ఆర్టికల్ 174(2)(బి) కింద అసెంబ్లీని రద్దు చేసిన తర్వాత మంత్రిమండలికి రాజ్యాంగబద్ధమైన పునాది ఉండదని ఆయన తెలిపారు. "ఇటువంటి పరిస్థితుల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు తాత్కాలికంగా ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా మాత్రమే కొనసాగే అవకాశం ఉంటుంది. అది కూడా గవర్నర్ కోరితేనే సాధ్యం. ఇది కేవలం రాజ్యాంగ సంప్రదాయం మాత్రమే. కచ్చితమైన నిబంధన కాదు. ఈ పరివర్తన దశను నిర్వహించడంలో గవర్నర్‌కు పూర్తి విచక్షణాధికారం ఉంటుంది" అని ఆయన వివరించారు. మమతా బెనర్జీ రాజీనామాకు నిరాకరించడం వల్ల రాజ్యాంగపరంగా యథాతథ స్థితిలో ఎటువంటి మార్పు ఉండదని ఆయన స్పష్టం చేశారు. తదుపరి దశలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలలో మెజారిటీ ఉన్న నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఆహ్వానించాల్సి ఉంటుంది.

### మమత ముందున్న మార్గాలు

ప్రస్తుతానికి ముఖ్యమంత్రి పదవిలో కొనసాగేందుకు మమతా బెనర్జీకి రాజ్యాంగబద్ధంగా ఎటువంటి ఆస్కారం లేదు. ప్రభుత్వం సమష్టిగా బాధ్యత వహించాల్సిన శాసనసభే ఉనికిలో లేనప్పుడు, సీఎం పదవిలో కొనసాగేందుకు అవకాశం ఉండదు. ఎన్నికైన ఎమ్మెల్యేల మద్దతుతోనే ముఖ్యమంత్రికి ప్రజాస్వామ్యబద్ధమైన అధికారం లభిస్తుంది. అసెంబ్లీ రద్దవడంతో ఆ అధికారం కోల్పోయినట్లే అవుతుంది. ఒకవేళ ఎన్నికల ప్రక్రియ లేదా ఫలితాలపై ఏవైనా అభ్యంతరాలుంటే, ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం 'ఎన్నికల పిటిషన్' ద్వారా సవాలు చేయడమే సరైన మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పిటిషన్‌ను సంబంధిత హైకోర్టులో దాఖలు చేసి, నిర్దిష్ట నియోజకవర్గంలో చట్ట ఉల్లంఘన జరిగిందని నిరూపించాల్సి ఉంటుంది.

# విజయ్ తో పాటు 107 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే



మొదటిపేజీ తరువాయి - విజయ్ గెలుపు) సాధించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటు విజయ్ కు అందని ద్రాక్షగా మిగిలిపోయే అవకాశాలు ఉన్నాయి. 118 మంది ఎమ్మెల్యేల జాబితాను సమర్పిస్తేనే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతిస్తానని గవర్నర్ చెప్పడం ఆ పార్టీకి, తమిళనాడులోని కోట్లాది మంది ఓటర్లకు శరాఘాతమే. ఇదే అదనుగా, తమిళనాడులో దశాబ్దాల రాజకీయ వైరం ఉన్న ఓల్డ్ గ్రాండ్ ద్రవిడియన్ పార్టీలు డీఎంకే, అన్నాడీఎంకే అధికారం కోసం చేతులు కలిపేందుకు సిద్ధమైనట్టు వార్తలు వస్తున్నాయి. అధికారం కంటే కూడా... రాష్ట్రంలో మూడో రాజకీయ శక్తిగా విజయ్ పార్టీ ఎదగకుండా నిలువరించడమే ఈ పార్టీల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో విజయ్ చేసిన ప్రకటన దేశ వ్యాప్తంగా చర్చను లేవనెత్తింది. తమను కాదని డీఎంకే లేదా అన్నాడీఎంకే ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నిస్తే తమ పార్టీకి చెందిన 107 మంది ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని టీవీకే హెచ్చరించింది. ఈ నిర్ణయం అమలులోకి వస్తే తమిళనాడులో రాజ్యాంగ సంక్షోభం తలెత్తడం ఖాయంగా కనిపిస్తోంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 190 ప్రకారం, ఒక ఎమ్మెల్యే తన రాజీనామా లేఖను నేరుగా స్పీకర్‌కు సమర్పించాలి. అయితే, ఈ రాజీనామాలు స్వచ్ఛందంగా ఇచ్చారా? లేక ఏదైనా ఒత్తిడితో ఇచ్చారా? అనేది స్పీకర్ క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. 107 మంది ఎమ్మెల్యేలు ఒకేసారి రాజీనామా చేయడం అనేది భారత ప్రజాస్వామ్య చరిత్రలో అసాధారణమైన విషయం. ఒకవేళ స్పీకర్ ఈ రాజీనామాలను ఆమోదిస్తే, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఆ 107 నియోజకవర్గాలకు ఆరు నెలల లోపు ఉపఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి అవుతుంది. అసెంబ్లీలోని మొత్తం 234 స్థానాల్లో సగానికి దగ్గరగా ఉన్న ఈ నియోజకవర్గాలకు ఉపఎన్నికలు జరపడం అంటే అది దాదాపుగా ఒక మినీ అసెంబ్లీ ఎన్నికతో సమానం. ఎన్నికల కమిషన్‌కు ఇది ఒక భారీ సవాలుగా మారుతుంది. అప్పటివరకు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడే పరిస్థితి లేకపోతే, రాజ్యాంగ యంత్రాంగం విఫలమైందనే కారణంతో గవర్నర్ ఆర్టికల్ 356 కింద రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల అధికారం మొత్తం కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఇదే జరిగితే తమిళనాడు వంటి రాష్ట్రంలో రాజకీయ సెగలు పుట్టడం ఖాయం. విజయ్ ఈ తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల మధ్య జరుగుతున్న తెరవెనుక చర్చలేనని తెలుస్తోంది. టీవీకే 108 స్థానాలు సాధించగా (విజయ్ రెండు చోట్ల గెలవడంతో ఒక సీటు ఖాళీ అవుతుంది, ఫలితంగా బలం 107 అవుతుంది), కాంగ్రెస్‌తో కలిపి వారి బలం 112కి చేరుకుంది. మ్యాజిక్ ఫిగర్ 118కి కేవలం 6 సీట్లు మాత్రమే తక్కువగా ఉన్న తరుణంలో.. ఇటు డీఎంకే, అటు అన్నాడీఎంకేలు కలిసి ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం ప్రయత్నిస్తున్నారనే వార్తలు టీవీకే క్యాంపులో ఆగ్రహాన్ని నింపాయి. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా తమను అడ్డుకుంటే, మళ్లీ ప్రజల వద్దకే వెళ్లి తేల్చుకోవడానికి సిద్ధమని విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఒకవేళ ఈ మూకుమ్మడి రాజీనామాలు గనుక జరిగితే, తమిళనాడు రాజకీయ చరిత్రలో ఇది మునుపెన్నడూ లేని ఒక విభిన్నమైన ఘట్టం అవుతుంది. గవర్నర్ తీసుకునే నిర్ణయం, ఎన్నికల కమిషన్ నిర్వహించే ఉపఎన్నికలు, ప్రజల నాడి.. ఇవన్నీ కలిసి తమిళనాడు భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అంటే ఏప్రిల్ 23న జరిగిన ఎన్నికల తీర్పుపై ఇది రెండోసారి ప్రజల అభిప్రాయాన్ని కోరడమే అవుతుంది.

# తెలంగాణలో బీసీ కులాల పేర్లు మార్పు.. కొత్త పేర్లు ఇవే!

**నిజం న్యూస్ హైదరాబాద్, మే 8:** తెలంగాణలోని వెనుకబడిన తరగతుల (బీసీ) చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన సామాజిక సంస్కరణకు శ్రీకారం చుట్టింది.బి సమాజంలో కించపరిచే విధంగా ఉన్న కొన్ని కులాల పేర్లను తొలగించి, వాటి స్థానంలో గౌరవప్రదమైన పేర్లను చేరుస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. బీసీ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఆయా వర్గాల ఆత్మగౌరవం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పులు తక్షణమే రాష్ట్ర గెజిట్ ద్వారా అధికారిక రికార్డుల్లోకి రానున్నాయి. బీసీ కులాల పేర్లు మార్పు: బీసీ గ్రూప్-ఏలో విప్లవాత్మక మార్పులు ప్రభుత్వం చేపట్టిన ఈ మార్పుల్లో బీసీ గ్రూప్-ఏ విభాగంలో అత్యధిక మార్పులు జరిగాయి. ముఖ్యంగా వినడానికి అసభ్యకరంగా ఉన్న పదాలను రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు.

**దొమ్మర:** ఈ పేరును తొలగించి 'గడ వంశీయ'గా మార్చారు.

**పిచ్చకుంట్ల:** ఇకపై ఈ కులస్తులను 'వంశ రాజ్'గా వ్యవహరిస్తారు.

**బుడబుక్కల:** వీరికి 'శివ క్షత్రియ' అనే గౌరవప్రదమైన పదాన్ని జోడించారు.

**వీరభద్రియ:** వీరి కోరిక మేరకు 'వీరముష్టి, నెట్టి కోటల' అనే పదాలను పర్యాయపదాలుగా చేర్చారు.

**వన్నార్:**బి ఈ పదాన్ని తొలగించి, రజక/చాకలి వర్గాల కోసం 'ధోబీ' అనే పదాన్ని ఖరారు చేశారు.

గ్రూప్-డిలో 'శూద్ర' పదం తొలగింపు బీసీ గ్రూప్-డి విభాగంలో కూడా ప్రభుత్వం సామాజిక స్పృహతో పలు మార్పులు చేసింది. ఎప్పటి నుంచో వివాదాస్పదంగా ఉన్న 'శూద్ర కులం' అనే పదాన్ని అధికారిక రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు. ఆ




స్థానంలో 'తమ్మలి (బ్రాహ్మణేతర)'గా పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల ఆ వర్గానికి స్పష్టమైన సామాజిక గుర్తింపు లభిస్తుంది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న 'మేర', 'చిప్పోలు' కులాలకు అదనంగా 'మేరు' అనే పదాన్ని చేర్చారు.

### విద్యార్థులు, ఉద్యోగార్థులకు మేలు

ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాల్లో (కుల ధ్రువీకరణ పత్రము) గౌరవప్రదమైన పేర్లను పొందే అవకాశం కలుగుతుంది. సమాజంలో పిలిచేటప్పుడు కలిగే ఇబ్బందులను తొలగించి, ఆయా వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే ఈ సంస్కరణ ముఖ్య ఉద్దేశమని బీసీ కమిషన్ వెల్లడించింది. కులాల పేర్ల మార్పుపై హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాలు, ఇది తమ సామాజిక హోదాను పెంచుతుందని అభిప్రాయపడుతున్నాయి.

# మ్యూల్ అకౌంట్లకు చెక్.. సైబర్ కేసుల దర్యాప్తులో బ్యాంకుల సహకారం ముఖ్యం: సైబరాబాద్ సీపీ



**నిజం న్యూస్ సైబరాబాద్, మే 8:** సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులతో శుక్రవారం సైబరాబాద్ సీపీ కార్యాలయ ఆడిటోరియంలో శుక్రవారం ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో బ్యాంకులు, పోలీసుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా దర్యాప్తును వేగవంతం చేయడం, ముఖ్యంగా మ్యూల్ అకౌంట్ల (వీబశ్రీవ ాఏషెశీబత్ం) నియంత్రణ, ఖాతాల ఫ్రీజ్ డిఫ్రీజ్ ప్రక్రియలు, బాధితులకు నగదు వాపసు ఇవ్వడం , డిజిటల్ మోసాల విచారణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు అత్యంత ప్రమాదకరమైన ముప్పుగా మారాయని తెలిపారు. ఆన్‌లైన్ స్కామ్‌లు, నకిలీ పెట్టుబడి పథకాలు, ప్రీ-లాంచ్ ఆఫర్లు, కాల్ సెంటర్ మోసాలు, క్రిప్టో కరెన్సీ స్కామ్‌లు తదితరాల ద్వారా ప్రజలు భారీ మొత్తంలో డబ్బును కోల్పోతున్నారని అన్నారు. చాలామంది తమ జీవితకాల పొదుపులను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సైబరాబాద్ పరిధిలో 2025 సంవత్సరంలో సైబర్ మోసాల కారణంగా ప్రజలు రూ.438 కోట్లను కోల్పోగా, 2026 సంవత్సరంలో



ఇప్పటివరకు రూ.104 కోట్లను కోల్పోయినట్లు వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా అవగాహన పెరుగుతున్నప్పటికీ, మరింత అప్రమత్తత మరియు పటిష్టమైన నివారణ చర్యలు అవసరమని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకింగ్ డేటా భద్రత, మ్యూల్ అకౌంట్ల నియంత్రణ, దర్యాప్తులకు బ్యాంకుల నుంచి సకాలంలో సహకారం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించడానికి ప్రతి బ్యాంకులో ప్రత్యేకమైన మరియు కేంద్రీకృత 'సైబర్ సెల్స్' ఏర్పాటు చేయాలని సీపీ కోరారు. ప్రజలు కూడా పెట్టుబడులు పెట్టే ముందు వాస్తవాలను సరిచూసుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మరియు నేరగాళ్లకు సహకరించవద్దని విజ్ఞప్తి చేశారు. దర్యాప్తులో ఎదురవుతున్న సవాళ్ల గురించి సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయి మనోహర్ మాట్లాడుతూ, బ్యాంకుల నుండి ఖాతా వివరాలు, కేవైసీ (ఖ్జ) పత్రాలు మరియు ఫ్రీజ్ కన్ఫర్మేషన్లు అందడంలో జరుగుతున్న ఆలస్యం వల్ల నిందితులను పట్టుకోవడం కష్టమవుతోందని తెలిపారు. మ్యూల్ అకౌంట్లను నియంత్రించడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని, ఒకసారి ఖాతాను ఫ్రీజ్ చేసిన తర్వాత ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకుండా చూడాలని బ్యాంకర్లకు సూచించారు. ఖాతాల ఫ్రీజ్ మరియు డిఫ్రీజ్ ప్రక్రియల్లో జరుగుతున్న ఆలస్యంపై కూడా చర్చించారు. సీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీ ఎన్‌సీఆర్‌బీ (చీజ=దీ) డాటాను విశ్లేషిస్తూ, ప్రతి బ్యాంకులో అప్‌డేట్ చేయబడిన నోడల్ ఆఫీసర్ వివరాలతో కూడిన 'సైబర్ క్రైమ్ రెస్పాన్స్ డెస్క్' ఏర్పాటు చేయాలని సూచించారు. దీనివల్ల కమ్యూనికేషన్ వేగవంతం కావడమే కాకుండా, కష్టమర్ల సొమ్మును కాపాడవచ్చునని తెలిపారు. బ్యాంక్ సిబ్బందికి సైబర్ నేరాల ప్రక్రియలపై శిక్షణ ఇవ్వాలని, కార్పొరేట్ ఖాతాలకు సంబంధించిన రిలేషన్ షిప్ మేనేజర్ల వివరాలను పంచుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి, క్రైమ్స్ డీసీపీ ఏ. ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, సీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీ హెచ్‌డీఎఫ్‌సీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం




**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 8:** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారి సౌజన్యంతో, బండి రమేష్ సహకారముతో, మాకినేని యాకనారాయణ (వినోద్) - విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరం నిర్వహించబడుతోంది.

**శిబిరాల వివరాలు:**

మొదటి క్యాంప్:
తేదీ: 09-05-2026 (శనివారం)। సమయం: ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 3:00 వరకు
వేదిక: ధర్మారెడ్డి కాలనీ ఫేజ్-2 పార్క్, హైదర్‌నగర్, కూకట్‌పల్లి.

రెండవ క్యాంప్:
తేదీ: 17-05-2026 (ఆదివారం)। సమయం: ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 3:00 వరకు
వేదిక: భగత్ సింగ్ నగర్, ఫేజ్ 2, వినాయక మండపం, హైదర్‌నగర్, కూకట్‌పల్లి.

ముఖ్య మనవి:
"ఆరోగ్యమే మహాభాగ్యం"

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ నిర్వహిస్తున్న ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మనవి.


మరిన్ని వివరాలకు సంప్రదించండి: 9666947927

# సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై యువకుడి దారుణంగా హత్య



**నిజం న్యూస్ హైదరాబాద్, మే 8:** జవహర్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటూ నాలుగేళ్లుగా సీతాఫల్‌మండి ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమిస్తున్న యావన్(23) అనే బీటెక్ 3తీఽ ఇయర్ చదువుతున్న యువకుడు ఈ విషయం తెలిసిన యువతి తల్లిదండ్రులు ఎన్నిసార్లు హెచ్చరించినా వినకుండా, సీతాఫల్‌మండి ప్రాంతంలో ఉండే తన స్నేహితుడి ఇంట్లో ఉంటూ తరచూ యువతిని కలుస్తున్న యావన్ దీంతో నిన్న రాత్రి మూడు ద్విచక్ర వాహనాలపై వచ్చి యావన్‌పై కత్తులతో దాడి చేసిన ఆరుగురు దుండగులు వారి నుండి తప్పించుకుని బయటికి వచ్చినా వదలకుండా దారుణంగా నడిరోడ్డుపై హతమార్చిన నిందితులు 17 చోట్ల కత్తి పోట్లకు గురి కావడంతో అక్కడికక్కడే మృతి చెందిన యువకుడు

# బండి రమేష్ కి అభినందనలు తెలిపినా బి బ్లాక్ ప్రెసిడెంట్ తూమ వేణు




**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 8:** తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన బండి రమేష్ అన్న ని ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, శేఖర్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు ఏ బ్లాక్ రామాదేవి , జ్యోతి, రమేష్ గుప్తా.

# ఇందిరమ్మ ఇల్లు పథకం పేదల పాలిట వరం

రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి వెల్లడి...





**మే 08 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండల కేంద్రంలో వేల్పూర్ గ్రామ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు రేగ్గుల శివ వైశాలి వారి కోరిక మేరకు నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం కు శుక్రవారం రోజున ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులతోపాటు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆ ఆత్మీయ కుటుంబంతో వారి సంతోషంని పంచుకొని శు భాకాంక్షలు తెలియజేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మండల ప్రెసిడెంట్ నర్సరెడ్డి, రమణ, గౌరాయి, నరేందర్,దాము మధు, ఇంద్ర గౌడ్, లహరి,లావణ్య, సతీష్, గణేష్, తదితరులు, పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ మరియు థలసేమియా దినోత్సవ వేడుకలు







**మే 08 నిజం న్యూస్:** ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ థలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని, నిజామాబాద్ జిల్లా లో గల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా పలు కార్యక్రమాలు కార్యక్రమాలు శుక్రవారం రోజున నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డునంట్ చిత్రపటానికి జ్యోతిని వెలిగించి, పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బుస్స ఆంజనేయులు మాట్లాడుతూ, మానవ సేవే మహోన్నత సేవ అని, రెడ్‌క్రాస్ సంస్థ సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. థలసేమియా బాధితులకు నిరంతర రక్తదానం అవసరమని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే బాలభవన్‌లో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం రెడ్‌క్రాస్ థలసేమియా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ సెంటర్‌లో, థలసేమియా బాధిత చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే ఈ సందర్భంగా తోట రాజశేఖర్ 87 వ సారి రక్తదానం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, కార్యదర్శి గోక అరుణ్ బాబు, డివిజన్ చైర్మన్ డా. కె. శ్రీశైలం, మండల చైర్మన్ వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ డా. వి. రాజేష్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బొద్దుల రామకృష్ణ, రెడ్‌క్రాస్ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పశువులకు ఎలాంటి రోగాలు సోకినవెంటనే వైద్య చికిత్సలు చేయించి కాపాడుకోవాలి




మోర్తాడ్ మండల **మే 08 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని దోన్ పాల్ గ్రామంలో జిల్లా పశు వైద్య శాఖ, మోర్తాడ్ పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున గ్రామంలో పశు వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ పశు వైద్య ఆరోగ్య శిబిరం ను స్థానిక సర్పంచ్ ముత్యాల బాజమ్మ రాములు, ఉపసర్పంచ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పరస రాజేందర్, ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు టి.రాజేందర్ లు పశువైద్య ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, మోర్తాడు మండల పశువైద్యాధికారి గౌతమ్ రాజ్ మాట్లాడుతూ, గ్రామాలలో పాడి పశువులు గాని, పశువులు గాని, వివిధ రకాల పశువులు, జంతువులు ఎలాంటి రోగాలకు గురైన వైద్యాధికారులకు సమాచారం అందిస్తే, సకాలంలో వెంటనే విచ్చేసి వైద్య చికిత్సలు చేస్తామని తెలిపారు. ఈ పశువైద్య శిబిరంలో 48 గేదెలకు వైద్య చికిత్సలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యాల రాములు, నాయకులు రేషం రాజేందర్, కురుమ రమేష్, కోరం సాయికుమార్, ఎం. రాజశేఖర్, శ్రీనివాస్, సి.హెచ్. సాయి కిరణ్, పశు వైద్య సిబ్బంది ప్రభాకర్, షేక్, జమీల్, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

# నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం పై అవగాహన



మెండోరా, **మే 08 నిజం న్యూస్:** మెండోరా ఎంపీడీవో కార్యాలయంలో ఎన్‌ఎఫ్‌బీఎస్ (నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్) ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియపై మండల స్థాయి కార్యదర్శులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అర్హులైన కుటుంబాలకు పథకం ప్రయోజనాలు అందేలా గ్రామ స్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. దరఖాస్తుల నమోదు సమయంలో అవసరమైన పత్రాలను సక్రమంగా పరిశీలించి, గడువులోపు అప్లికేషన్లు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు.

# పదవ తరగతి విద్యార్థులకు ఘన సన్మానం



మెండోరా, **మే 08 నిజం న్యూస్:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సావెల్‌లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్‌తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సర్పంచుల ఐక్యతతో గ్రామాభివృద్ధికి కృషి...!



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, **మే 08 నిజం న్యూస్:** -బూర్గంపాడు మండల సర్పంచుల సంఘానికి కొత్త కమిటీ ఏకగ్రీవంగా అధ్యక్షుడైన బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజులి -సారపాకలో ఘనంగా నిర్వహించిన ఎన్నికల సమావేశం బూర్గంపాడు మండల సర్పంచుల సంఘం కమిటీ ఎన్నికలు శుక్రవారం సారపాకలో నిర్వహించబడ్డాయి. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు హాజరై సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బూర్గంపాడు గ్రామ సర్పంచ్ మందా నాగరాజును మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2026 మే 8 తేదీ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించినట్లు సమావేశంలో ప్రకటించారు. అదేవిధంగా సంఘం ఉపాధ్యక్షులుగా తాటి వాణి, బానోతు పద్మ, గుమ్మడి కృష్ణవేణి, శర్ప నాగమణి, వర్కింగ్ ప్రెసిడెంట్గా పూనం సురేందర్, కోశాధికారిగా కుంజా కొండమ్మ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మందా నాగరాజు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులను సమన్వయం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికి సంఘం వేదికగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గుండి బాబురావు, బానోతు సరోజ, బొర్రా సుభద్ర, పోతునూరు సూరమ్మ, బొల్లి నిరోషా, బొల్లా సైదమ్మ, తాటి లక్ష్మి, బానోతు నరసింహా, వర్ష మంగమ్మ, రైతులు పాల్గొన్నారు.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
శనివారం 09 - 05 - 2026

# సినిమాల్లో ఏఐ వినియోగంపై గోల్డెన్ గ్లోబ్స్ కొత్త నిబంధనలు.. వాటికే ప్రాధాన్యం



గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ నిర్వాహకులు సినిమాల్లో ఏఐ వినియోగంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. హాలీవుడ్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ఏఐ ప్రభావం నేపథ్యంలో 2027 అవార్డుల కోసం ప్రత్యేక నిబంధనలను ప్రకటించారు. ఇటీవల ఆస్కార్ అవార్డ్స్ కూడా ఇలాంటి మార్గదర్శకాలను తీసుకురావడంతో.. ఇప్పుడు గోల్డెన్ గ్లోబ్స్ సంస్థ కూడా స్పష్టమైన నియమాలను అమల్లోకి తీసుకొచ్చింది. నిర్వాహకుల ప్రకటన ప్రకారం.. భవిష్యత్తులో అవార్డులకు పంపించే సినిమాల్లో ఏఐ వినియోగం ఉండవచ్చని అంగీకరించినప్పటికీ, మానవ సృజనాత్మకతే ప్రధానంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏఐ పూర్తిగా నిషేధించకపోయినా, దాన్ని కేవలం సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ముఖ్యంగా చిత్రాల్లో ఏ సన్నివేశానికి అయినా ఏఐ ఉపయోగించినట్లయితే, దాని వివరాలను తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది. నటీనటుల స్వరం, రూపం లేదా భావ వ్యక్తీకరణలను కృత్రిమ మేధతో మార్చినట్లయితే.. ఆ విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని గోల్డెన్ గ్లోబ్స్ కమిటీ పేర్కొంది. అలాగే నటన విభాగాల్లో ఎంట్రీలను పరిశీలించే సమయంలో.. ఏఐ ఆధారిత మార్పుల కంటే సహజ నటనకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. కృత్రిమ మేధ సహాయంతో నటనకు మెరుగులు చేర్చినా.. అసలు గుర్తింపు మాత్రం నటీనటుల ప్రతిభకే దక్కుతుందని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఇంకా ఒక ముఖ్యమైన అంశాన్ని కూడా గోల్డెన్ గ్లోబ్స్ సంస్థ ప్రస్తావించింది. ఎలాంటి అనుమతి లేకుండా ఎవరి స్వరం లేదా రూపాన్ని ఏఐ ద్వారా ఉపయోగించినా.. అది పూర్తిగా అనైతికమని, అలాంటి చిత్రాలను ఆమోదించబోమని హెచ్చరించింది. ప్రస్తుతం హాలీవుడ్‌లో డీప్‌ఫేక్ టెక్నాలజీ, డిజిటల్ క్లోనింగ్‌పై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.దర్శకత్వం, రచన, సంగీతం, యానిమేషన్ వంటి విభాగాల్లో కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. సాంకేతికతను సృజనాత్మకతకు తోడ్పాటుగా మాత్రమే ఉపయోగించాలే తప్ప.. పూర్తిగా దానిపై ఆధారపడకూడదని సూచించారు. ప్రస్తుతం ప్రపంచ సినీ పరిశ్రమలో ఏఐ వినియోగంపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఒకవైపు టెక్నాలజీ కొత్త అవకాశాలను తెరుస్తుంటే.. మరోవైపు కళాకారుల హక్కులు, మానవ సృజనాత్మకత భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో గోల్డెన్ గ్లోబ్స్ తీసుకున్న తాజా నిర్ణయం సినీ రంగంలో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక వచ్చే ఏడాది జనవరి 10న గోల్డెన్ గ్లోబ్స్ అవార్డు వేడుకను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# ‘నేను ఎవరు?’ అనే ప్రశ్నే రమణ మహర్షిని మహర్షిగా మార్చింది పూరీ జగన్నాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు



అగ్ర దర్శకుడు పూరీ జగన్నాథ్ తన ప్రత్యేక ఆలోచనలు, జీవిత తత్వాన్ని ‘పూరీ మ్యూజింగ్స్’ పేరుతో అభిమానులతో పంచుకుంటున్న సంగతి తెలిసిందే. సమాజం, మనస్తత్వం, జీవితం, సంబంధాలు, ఆధ్యాత్మికత వంటి పలు అంశాలపై తనదైన శైలిలో మాట్లాడే పూరీ.. తాజాగా భారతదేశానికి చెందిన గొప్ప ఆధ్యాత్మిక గురువు రమణ మహర్షి గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ప్రస్తుతం విజయ్ సేతుపతితో కలిసి ‘స్లమ్ డాగ్ -- 33 టెంపుల్ రోడ్’ సినిమా తెరకెక్కిస్తున్న పూరీ జగన్నాథ్.. తన యూట్యూబ్ ఛానల్‌లో వరుసగా పాడ్‌కాస్ట్ వీడియోలను విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా విడుదల చేసిన వీడియోలో రమణ మహర్షి జీవితం, ఆయన ఆలోచనలు, ఆధ్యాత్మిక ప్రయాణం గురించి విశ్లేషించారు. పూరీ మాట్లాడుతూ.. “రమణ మహర్షి అసలు పేరు వెంకటరామన్ అయ్యర్. 1879లో తమిళనాడులో జన్మించారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే ఆయనకు గొప్ప ఆత్మానుభవం కలిగింది. ‘నేను ఎవరు?’ అనే ప్రశ్న ఆయన మనసులో మొదలైంది. అదే ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది” అని చెప్పారు.ఆ ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నంలో ఆయన ఇంటిని విడిచి తిరువణ్ణామలైకి వెళ్లిపోయారని పూరీ వివరించారు. అక్కడ అరుణాచల కొండల సమీపంలో నివసిస్తూ ‘ఆత్మ విచారం’ అనే మార్గాన్ని అనుసరించారని తెలిపారు. “మనసును లోపలికి తిప్పి నిజమైన మన స్వరూపాన్ని తెలుసుకోవడమే ఆత్మ విచారం” అని పూరీ పేర్కొన్నారు. రమణ మహర్షి చాలా సంవత్సరాలు మౌనంగా గడిపారు. అవసరమైనప్పుడు మాత్రమే మాట్లాడేవారు. విరూపాక్ష గుహల్లో ధ్యానం చేస్తూ ఉండగా పిల్లలు, పురుగులు శరీరాన్ని గాయపరిచినా ఆయన ధ్యానం నుంచి బయటకు రాలేదు. అంత లోతైన సమాధి స్థితిలోకి వెళ్లిపోయేవారు. అదే సమయంలో ఆయనకు జ్ఞానోదయం కలిగింది” అని తెలిపారు.రమణ మహర్షి జీవనశైలి ఎంత సాదాసీదాగా ఉండేదో కూడా పూరీ వివరించారు. “ఆశ్రమంలో ఆయన కూడా వంట చేసేవారు. కూరగాయలు తరిగేవారు. ప్రత్యేకమైన ఆహారం కోరుకునేవారు కాదు. అందరితో కలిసి కూర్చుని భోజనం చేసేవారు” అని చెప్పారు. జంతువుల పట్ల రమణ మహర్షి చూపిన ప్రేమను కూడా పూరీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. “ఆశ్రమంలో ఉన్న గోవు లక్ష్మిని ఎంతో ప్రేమించేవారు. కోతులు, కుక్కలు, నెమళ్లు కూడా ఆశ్రమంలో స్వేచ్ఛగా తిరిగేవి. జంతువులకు కూడా ఆత్మ ఉందని ఆయన నమ్మేవారు. అందుకే వాటిని మనుషుల్లాగే గౌరవించేవారు” అని తెలిపారు. ఇక రమణాశ్రమం గురించి మాట్లాడుతూ.. “ప్రస్తుతం ఆయన నివసించిన ప్రదేశంలో శ్రీ రమణాశ్రమం ఏర్పడింది. ప్రపంచం నలుమూలల నుంచి ఎంతో మంది అక్కడికి వచ్చి ధ్యానం చేస్తుంటారు. ఆ ఆశ్రమం నిశ్శబ్ద వాతావరణంలో ఉంటుంది. జీవితంలో ఒక్కసారైనా వెళ్లి చూడాల్సిన ప్రదేశం అది” అని పూరీ పేర్కొన్నారు. రమణ మహర్షి బోధనల్లో మౌనానికి ఉన్న ప్రాముఖ్యతను కూడా పూరీ గుర్తు చేశారు. “నిశ్శబ్దమే అత్యంత శక్తివంతమైన బోధన అని రమణ మహర్షి చెప్పేవారు. ప్రేమ, శాంతి, జ్ఞానం ఆయన సందేశం. చాలా ప్రశ్నలకు ఆయన నవ్వుతోనే సమాధానం చెప్పేవారు” అని తెలిపారు. చివరగా రమణ మహర్షి చెప్పిన మాటలను గుర్తు చేస్తూ పూరీ.. “‘నేను ఎవర్ని?’ అనే ప్రశ్న జవాబు కోసం కాదు.. ప్రశ్నించే తనని తాను తెలుసుకోవడానికి ఉద్దేశించబడింది” అంటూ ముగించారు. ప్రస్తుతం పూరీ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## ఓవర్సీస్‌లో ‘పెద్ది’ బాక్సాఫీస్ సునామీ

# 30 నిమిషాల్లోనే రికార్డు స్థాయి బుకింగ్స్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ విడుదలకు ముందే సంచలనాలు సృష్టిస్తోంది. యువ దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఓవర్సీస్ బుకింగ్స్ ఓపెన్ చేయగా, అక్కడ అభిమానుల నుంచి ఊహించని స్థాయిలో స్పందన లభిస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ‘పెద్ది’ అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమైన అరగంటలోనే 50 వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు సమాచారం. ఈ వేగం చూస్తుంటే సినిమా ఓవర్సీస్ మార్కెట్‌లో భారీ ఓపెనింగ్స్ నమోదు చేసే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో తెలుగు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన కనిపిస్తోందట. ముఖ్యంగా రామ్ చరణ్‌కు ‘ఆర్ఆర్ఆర్’ తర్వాత గ్లోబల్ స్థాయిలో ఏర్పడిన క్రేజ్ ‘పెద్ది’ బుకింగ్స్‌పై స్పష్టంగా కనిపిస్తోందని ట్రేడ్ నిపుణులు చెబుతున్నారు. ‘ఉప్పెన’తో దర్శకుడిగా సంచలనం సృష్టించిన బుచ్చిబాబు సానా, ఇప్పుడు రామ్ చరణ్‌తో కలిసి చేస్తున్న ‘పెద్ది’ సినిమాను చాలా గ్రాండ్‌గా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. గ్రామీణ నేపథ్యంతో కూడిన మాస్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. రామ్ చరణ్ ఈ సినిమాలో పూర్తిగా డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారని ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ద్వారా స్పష్టమైంది. మాస్ ఆడియన్స్‌తో పాటు ఫ్యామిలీ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా కథను రూపొందించినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. రామ్ చరణ్‌తో ఆమె కెమిస్ట్రీ ఎలా ఉంటుందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇదే ఆమెకు మరో భారీ తెలుగు ప్రాజెక్ట్ కావడంతో బాలీవుడ్ ప్రేక్షకుల్లో కూడా సినిమాపై బజ్ పెరిగింది.ఈ సినిమాకు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్ అభిమానులను ఆకట్టుకోగా, సినిమాలో సంగీతం మరో హైలైట్ అవుతుందని మేకర్స్ చెబుతున్నారు. వృద్ధి ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 3న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా భాషల్లో విడుదల కానుంది. అంతేకాకుండా ప్రత్యేకంగా పైడ్ ప్రీమియర్స్ కూడా ప్లాన్ చేయడం విశేషం. ప్రస్తుతం ఓవర్సీస్ బుకింగ్స్‌కు వస్తున్న స్పందన చూస్తుంటే, ‘పెద్ది’ విడుదల రోజునే భారీ రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఫైనల్ ప్రీ-సేల్స్, ప్రీమియర్ షో కలెక్షన్స్ ఎక్కడివరకు వెళ్లాయో అన్నది ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# ఓటీటీలోకి వచ్చేసిన బ్లాక్‌బస్టర్ ‘వాలా 2’.. యువతను కట్టిపడేసిన సినిమాని మిస్ కావొద్దు..!



ఈ ఏడాది పెద్ద స్టార్ హీరోల సినిమాల కంటే యూత్ కథలతో వచ్చిన చిన్న సినిమాలే ప్రేక్షకులను ఎక్కువగా ఆకట్టుకున్నాయని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన కొన్ని చిన్న చిత్రాలు దేశవ్యాప్తంగా సంచలన విజయాలు సాధించాయి. అలాంటి చిత్రాల్లో భారీ విజయాన్ని అందుకున్న సినిమా ‘వాలా 2’. ఇప్పటికే విడుదలైన తొలి భాగం అక్కడ సంచలన విజయాన్ని అందుకోగా, అదే దర్శకుడు రెండో భాగాన్ని మరింత కొత్తగా తెరకెక్కించి ప్రేక్షకులను మెప్పించాడు. ముఖ్యంగా కొత్త నటీనటులతో సినిమా రూపొందించినప్పటికీ కథ, భావోద్వేగాలు, యువతకు దగ్గరైన అంశాలతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ ఏడాది మలయాళ సినీ పరిశ్రమలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. మలయాళంలో భారీ విజయాన్ని అందుకున్న తర్వాత ఈ సినిమాను తెలుగులో కూడా విడుదల చేశారు. మన ప్రేక్షకుల నుంచి కూడా ఈ చిత్రానికి మంచి ఆదరణ లభించింది. ముఖ్యంగా యువత ఈ సినిమాకు బాగా కనెక్ట్ కావడంతో థియేటర్లలో మంచి వసూళ్లు సాధించింది.యువత భావోద్వేగాలు, స్నేహం, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ‘మన శంకర వరప్రసాద్ గారు’ నిర్మాత సాహు గారపాటి తెలుగు ప్రేక్షకులకు అందించారు. థియేటర్లలో విజయవంతమైన ప్రదర్శన అనంతరం ఇప్పుడు ఈ చిత్రం డిజిటల్ వేదికలోకి అడుగుపెట్టింది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్ స్టార్ ఈ చిత్రానికి డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. నేటి నుంచి ఈ సినిమా తెలుగు, మలయాళం సహా మొత్తం ఐదు భాషల్లో ప్రసారం అవుతోంది. దీంతో థియేటర్లలో ఈ చిత్రాన్ని మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే ఈ సినిమాను ఆస్వాదించే అవకాశం పొందారు. ఈ సినిమాలో హషీర్ హెచ్, అలన్ బిన్ సిరాజ్, వినాయక్ వి, అజిన్ జాయ్ ప్రధాన పాత్రల్లో నటించారు. కొత్త నటీనటులైనా తమ సహజ నటనతో ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నారు. దర్శకుడు సావిన్ ఎస్ ఏ యువత భావోద్వేగాలను సహజంగా చూపించిన తీరు సినిమాకు పెద్ద బలంగా నిలిచింది. భావోద్వేగాలతో కూడిన కథలను ఇష్టపడే వారికి ‘వాలా 2’ మంచి వినోదాన్ని అందించనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా స్నేహం, ప్రేమ, జీవిత పోరాటాల నేపథ్యంలో సాగే ఈ సినిమా యూత్‌ని మరింత ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పవన్ కల్యాణ్ సీన్ రిపీట్.. ప్రదీప్ స్పీడ్‌కు బ్రేక్!



సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ అనేది ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒక వెలుగు వెలిగిన హీరోకైనా ఏదో ఒక పాయింట్ దగ్గర బాక్సాఫీస్ స్పీడ్ తగ్గక తప్పదు. ఇప్పుడు సరిగ్గా ఇదే పరిస్థితి కోలీవుడ్ యంగ్ స్టార్ ప్రదీప్ రంగనాథన్‌కు ఎదురైంది. వరుసగా వంద కోట్ల గ్రాస్ వసూలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద తిరుగులేని జోరు మీద ఉన్న ఈ కుర్ర హీరోకు, ఒక సినిమా ఫలితం ఒక పెద్ద షాక్ ఇచ్చింది. టాలీవుడ్‌లో పవన్‌కల్యాణ్ వరుస శతకాల రికార్డుకు ఎలాగైతే బ్రేక్ పడిందో, ఇప్పుడు ప్రదీప్ కెరీర్‌లో కూడా అదే రిపీట్ అవ్వడం ట్రేడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పవన్‌కల్యాణ్ రీఎంట్రీ తర్వాత వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో, హరిహర వీరమల్లు, ఒా+ ఇలా వరుస సినిమాలతో వరుసగా వంద కోట్ల మార్కును దాటేశారు. కొన్ని సినిమాలకు టాక్ తేడా కొట్టినా సెంచరీ మాత్రం మిస్ కాలేదు. అయితే భారీ అంచనాలతో వచ్చిన ‘ఉస్తాద్’ మాత్రం ఆ మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోవడంలో విఫలమైంది. వరుసగా కొనసాగుతున్న సెంచరీ రికార్డులకు గబ్బర్ సింగ్ కాంబినేషన్ బ్రేక్ వేస్తుందని ఎవరు ఊహించలేదు. ఇక ఇప్పుడు ప్రదీప్ రంగనాథన్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ‘లవ్ టుడే’తో సెన్సేషన్ క్రియేట్ చేసిన ప్రదీప్, ఆ తర్వాత వచ్చిన డ్యూడ్, డ్రాగన్ సినిమాలతో కూడా వంద కోట్ల క్లబ్‌లో చేరిపోయాడు. హ్యాట్రిక్ హిట్స్ తర్వాత ఆయన రేంజ్ మారిపోతుందని అందరూ భావించారు. కానీ లేటెస్ట్ గా విడుదలైన ‘హ×ఖ’ (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ) మాత్రం ప్రదీప్ జోరుకు కళ్లెం వేసింది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. 2040 బ్యాక్‌డ్రాప్‌లో టెక్నాలజీకి, ప్రేమకు మధ్య సాగే ఈ ప్రయోగం ప్రేక్షకులకు అంతగా కనెక్ట్ అవ్వలేదు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా కేవలం 60.47 కోట్ల గ్రాస్ దగ్గరే ఆగిపోయింది ట్రేడ్ వర్గాల అంచనా. దీనివల్ల ప్రదీప్ వరుసగా సాధిస్తున్న వంద కోట్ల రికార్డుకు బ్రేక్ పడినట్లయ్యింది. నిజానికి ప్రదీప్ రంగనాథన్ యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు. ఆయన సినిమాల్లో ఉండే నేటివిటీ, కామెడీ టైమింగ్ ప్రేక్షకులకు బాగా అలవాటైపోయింది. అయితే ‘హ×ఖ’ విషయంలో జరిగిన తప్పు ఏంటంటే, కాన్సెప్ట్ కొత్తగా ఉన్నా దాన్ని ప్రజెంట్ చేయడంలో దర్శకుడు తడబడ్డాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంత పెద్ద స్టార్‌కైనా బాక్సాఫీస్ వద్ద పరాజయాలు సహజమే. పవన్‌కల్యాణ్ లాంటి సీనియర్ హీరోకే ఫ్లాపులు తప్పనప్పుడు, కెరీర్ మొదట్లోనే ఉన్న ప్రదీప్‌కు ఇదొక మంచి లెసన్ అని చెప్పాలి. ఈ ఒక్క సినిమాతోనే ప్రదీప్ క్రేజ్ తగ్గిందని చెప్పలేం. ఎందుకంటే ఆయనపై ఆడియన్స్‌లో ఇంకా నమ్మకం ఉంది. నెక్స్ట్ చేయబోయే ప్రాజెక్టుల విషయంలో స్క్రిప్ట్ సెలక్షన్‌పై మరింత ఫోకస్ పెడితే మళ్లీ ఫామ్‌లోకి రావడం ఆయనకు పెద్ద కష్టం కాదు. సినిమా రంగంలో ఒడిదుడుకులు సహజం, వాటిని దాటుకుని నిలబడటమే అసలైన సక్సెస్. మరి ప్రదీప్ రంగనాథన్ తన తదుపరి చిత్రంతో మళ్లీ వంద కోట్ల క్లబ్‌లోకి రీఎంట్రీ ఇస్తాడో లేదో వేచి చూడాలి.